


RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY తెలుగు దిన పత్రిక...

బుధవారం, 14 జనవరి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 03 | సంచిక 64

# ఈ నెల 18న కేబినెట్ భేటీ

## - సంప్రదాయానికి భిన్నంగా ఈసారి మేడారంలో



**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 18న ములుగు జిల్లా మేడారంలో నిర్వహి ంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతర ఈ నెల 28న ప్రారంభం కానుండటంతో సంప్రదాయానికి భిన్నంగా ఈసారి మేడారంలో కేబినెట్ భేటీ నిర్వహించనున్నట్లు తెలిసింది. 18న ఉదయం ఉమ్మ డి ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్? రెడ్డి శంకుస్థాపనలు చేస్తారు. అక్కడే కాంగ్రెస్? పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సీపీఐ వంద సంవత్సరాల వేడుకలకు సీఎం హాజరవుతారు. అదే రోజున సాయంత్రానికి ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం మేడారం చేరుకుంటారు. ఆపై 5 గంటల తర్వాత కేబినెట్ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. కీలక అంశాలపై చర్చలు : 19న ఉదయం అమ్మవార్ల నూతన ప్రాంగణ ప్రారంభోత్సవం, దర్శనం పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి హైదరాబాద్?కు తిరుగు పయనమవుతారు. అదే రోజు రాత్రి దావోస్?కు వెళ్తారు. 18న మేడారంలో నిర్వహించాలని యోచిస్తున్న మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నట్లు సమాచా రం. ప్రధానంగా త్వరలో పురపాలక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో పట్టణాభివృద్ధి పథకాలపై చర్చించే అవకాశం ఉంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపైనా కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్? ప్రవేశపెట్టనుండటంతో అందుకు అనుగుణంగా శాఖల వారీగా రాష్ట్ర బడ్జెట్? రూపుకల్పనపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. రైతు భరోసా నిధుల విడుదల, హ్యామ్? రోడ్లు, తదితర అంశాలపైనా నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. 30 లక్షల మంది వస్తారని అంచనా : మేడారం మహాజాతర నిర్వహణలో ఆర్టీసీ ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది. ఇంకో రెండు వారాల్లో మహా జాతర ప్రారంభం కానుంది. కాగా ఈ జాతర ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ఆర్టీసీకి నిధులను కేటాయించింది. కిందటి సంవత్సరం జాతరలో సుమారుగా 20 లక్షల మంది భక్తులు ఆర్టీసీలో ప్రయాణించారు. ఈ సంత్సరం 30 లక్షల మంది వరకూ వస్తారని ఆర్టీసీ అంచనా వేస్తోంది. దీనికి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. 14 వేల మంది సిబ్బంది : గత సంవత్సరం జారత కోసం 3,500 బస్సులను ఉపయోగించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అదనంగా 500 బస్సులను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు వేల బస్సులు ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్?, కరీంనగ్, నిజామాబాద్? జిల్లాల్లోని 51 పాయింట్ల నుంచి బస్సులు నడిపించనున్నారు. ఈ నెల 25 నుంచి ఆయా ప్రాంతాల నుంచి సర్వీసులు ప్రారంభం కానున్నాయి. దీనిలో మొత్తం 14 మంది సిబ్బంది సేవలు అందించనున్నారు. హైదరాబాద్? నుంచి ప్రత్యేకంగా ఏసీ బస్సులను ఏర్పాటు చేయనున్నారు. అయితే వాటికి ఆన్?లైన్? రిజర్వేషన్? సదుపాయం కల్పించలేదు. రద్దీకి అనుగుణంగా సర్వీసులను సిద్ధం చేయనున్నారు. భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం : అన్ని శాఖల సమన్వయంతో మేడారం జాతరను విజయవంతం చేస్తామని వరంగల్ ఆర్ఎం డి. విజయభాను పేర్కొన్నారు. ఈ నెల 23న మేడారంలో బస్? పాయింట్ ప్రారంభించే అవకాశం ఉందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. సిబ్బందికి విడతల వారీగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

## కాంగ్రెస్‌లోకి కవిత ఎంట్రీపై

# పీసీసీ చీఫ్ క్లారిటీ




**హైదరాబాద్, జనవరి 13:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారం టూ కొద్దిరోజులుగా వస్తున్న వార్తలపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందిం చారు. మంగళవారం నాడు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశమే లేదని స్పష్టం చేశారు. తెలంగాణాలో బీఆర్ఎస్ పార్టీకి గతం తప్ప.. భవిష్యత్తు లేదంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబ అవినీతి గురించి కవిత నిజాలు చెప్తున్నారన్నారు. తాము చేసిన ఆరోపణలపై కవిత సమాధానం రూపంలో రుజువై ందని చెప్పారు. కవిత మాటలతో కేసీఆర్ అవినీతి నిజమని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని ఆయన చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్‌సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణా ప్రయోజనాలే ముఖ్యమని.. ఒక్క నీటిబొట్టును కూడా వదలమని తేల్చిచెప్పారు. అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీల విషయంలో మంచి స్పందన వస్తోందని నమ్ముతున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో కార్పొరేషన్ ఛైర్మన్లను భర్తీ చేస్తామని ప్రకటించారు. పదవులు తక్కువ అయ్యాయని... ఆశావహులు ఎక్కువ అయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ తరఫున ఒక కమిటీ వేస్తామని.. సర్వేల ఆధారంగా టికెట్ల ఇస్తామని చెప్పారు. గెలిచే అభ్యర్థులకే టికెట్ ఇస్తామని మహేశ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పొత్తుపై పీఏసీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# మున్సిపల్ పోరుకు రంగం సిద్ధం

## - 51.92 లక్షల మందితో తుది ఓటర్ల జాబితా విడుదల

**హైదరాబాద్ :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైంది. పట్టణ ప్రాంతాల్లో ఓటు హక్కు ఉన్న వారి వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. మొత్తం 117 మున్సిపా లిటీలు, 6 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఓటర్ల తుది జాబితా ను అధికారులు విడుదల చేశారు. తాజా లెక్కల ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 51,92 220 గా నమోదైంది. ఇందులో మహిళా ఓటర్లు 25,37,136 మంది కాగా, పురుష ఓటర్లు 26,54,453 మంది ఉన్నారు. ఇతరులు 631 మందిగా తేలింది. ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు వేగవంతం చేసింది. కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షలు నిర్వహిం చిన ఎన్నికల సంఘం, జనవరి 13న (మంగళవారం) పోలింగ్ కేంద్రాల వారీగా ముసాయిదా జాబితాను విడుదల చేయనుంది. అనంతరం, ఈ నెల 16న ఫోటోలతో కూడిన పూర్తి స్థాయి ఫైనల్ ఓటర్ లిస్టును ప్రజలందరికీ అందుబాటులో ఉంచను న్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగానే ఎస్సీ, ఎస్టీ రిజర్వేష న్లు ఖరారు కానున్నాయి. మరోవైపు, ఎన్నికల ప్రచారానికి సం బంధించి కూడా కఠిన నిబంధ నలను ఎన్నికల సంఘం ప్రక టించింది. రాజకీయ పార్టీలు తమ 'స్టార్ క్యాంపెయినర్ల' జాబి తాను ముందే సమర్పించాలని ఆదేశించింది.




గుర్తింపు పొందిన పార్టీలకు 20 మందిని, రిజిస్టర్ అయిన ఇతర పార్టీల కు 5 గురు స్టార్ క్యాంపెయినర్లను మాత్రమే అనుమతిస్తారు. ప్రచార ఖర్చుల నిబంధనలు కఠినంగా ఉన్నాయి. కోసం చేసే ఖర్చును నేరుగా అభ్యర్థి ఖాతాలోనే జమ చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

## విజయవాడ రహదారిపై

# 4 లక్షల వాహనాలు

**హైదరాబాద్ :** సంక్రాంతి పండుగ సెలవులు ప్రారంభమ వడంతో యాదాద్రి పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీ వాహన రద్దీ ఏర్పడింది. నగరాల్లో పనిచేసే వారి బృందా లు కుటుం బాలతో కలిసి సొంత ఊళ్లకు చేరుకునేందుకు బయలుదేరడంతో హైదరా బాద్ నుంచి విజయవాడ దిశగా వాహనాల వరుస కిలోమీటర్ల దూరం వరకూ కొనసాగుతోంది. పెదకాపర్తి, చిట్యాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నత్తనడకన కదులుతోంది. భోగి, సంక్రాంతి పండుగల కారణంగా రాబోయే రెండు రోజుల్లో ఈ రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధి కారులు అంచనా వేస్తున్నారు. గత నాలుగు రోజుల్లోన రెండు లక్షలకుపైగా వాహనాలు పంతంగి టోల్‌గేట్ ద్వారా ప్రయాణించినట్లు అంచనా. టోల్ సిబ్బంది అదనపు లేన్లు తెరిచి వాహనాలను క్లియర్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ, ఊళ్లకు చేరాలనే ఆత్రతలో బయలుదేరిన వాహనదారులతో

# బ్రిడ్జ్ పైసలు నేను తెచ్చిన

## - వాగ్వాదానికి దిగిన ఈటల, బీఆర్ఎస్ ఎమ్మెల్యే



**మేడ్చల్ జిల్లా:** మేడ్చల్ జిల్లాలోని మచ్చబొల్లారంలో రైల్వే అండర్ బ్రిడ్జ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమం వేడుక కన్నా ఘర్షణకు వేదికగా మారింది. కార్యక్రమానికి హాజరైన బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మరియు బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మధ్య తీవ్ర మాటల యుద్ధం జరిగింది. వంతెన పనులకు అవసరమైన నిధులు ఎవరు తెచ్చారనే విషయంపై ఇద్దరు నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. నిధులు తమ పార్టీ కృషితోనే లభించాయని ఒకరిపై మరొకరు వాదించడంతో వాగ్వాదం తీవ్రరూపం దాల్చింది. కొంతసేపు ఇద్దరి అనుచరుల మధ్య తోపులాట కూడా చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తం కావడంతో పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలను విడదీసి శాంతింపజేశారు. ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో ఈటల రాజేందర్ ఆగ్రహంతో కార్యక్రమం నుండి బయటకు నడుచుకుంటూ వెళ్లిపోయారు. ఒక అభివృద్ధి కార్యక్రమం రాజకీయ ద్వేషాల వేదికగా మారిన ఈ ఘటన, బీజేపీ––బీఆర్ఎస్ నేతల మధ్య ఉన్న ఉద్రిక్తత మరలా బయటపడినట్లుగా పరిశీలకులు భావిస్తున్నారు. ఈ సంఘటనతో మచ్చబొల్లారంలో కొద్ది సమయానికి గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి.

## ఐఏఎస్ అధికారిణిని లక్ష్యంగా చేసుకున్న

# పోస్టులపై సిట్ ఏర్పాటు



**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఒక మంత్రి, అలాగే ఓ మహిళా ఐఏఎస్ అధికారిణిపై సోషల్ మీడియాలో అవమానకరమైన పోస్టులు వైరల్ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత గంభీరంగా స్పందించింది. ఈ కేసులను పూర్తిగా విచారించడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు 8 మంది సభ్యులతో కూడిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) ఏర్పాటు అయింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఈ దర్యాప్తు బృందాన్ని నడిపించనున్నారు. సోషల్ మీడియా పోస్టుల మూలం, ఉద్దేశం, బాధ్యులపై చర్య వంటి అంశాలను సిట్ పరిశీలించనుంది. మార్ఫ్ చేసిన ఫోటో కేసు నారాయణపేట పోలీసు స్టేషన్‌లో నమోదైంది. 'తెలంగాణ పబ్లిక్ టీవీ' అనే వాట్సాప్ గ్రూపులో సీఎం రేవంత్ రెడ్డి ఫోటోను మార్చి పోస్ట్ చేశారని కావలి వెంకటేశ్‌ను పోలీసులు గుర్తించారు. కాంగ్రెస్ నేత గుళ్ల నరసింహ ఫిర్యాదు మేరకు ఈ ఎఫ్ఐఆర్ నమోదు అయింది. ఇక్కడితో ఆగకుండా మరో పెద్ద ఫిర్యాదు కూడా వచ్చింది. ఓ మంత్రి మరియు మహిళా ఐఏఎస్ అధికారిణి మధ్య అనైతిక సంబంధాలున్నాయని, ఆమెకు ప్రత్యేకమైన పోస్టింగ్ ఇస్తున్నారని తప్పుడు వార్తలు పలు చానెళ్లు, యూట్యూబ్ ఛానెళ్లు, సోషల్ అకౌంట్లు ప్రచారం చేశాయి. ఐఏఎస్ అసోసియేషన్ తరఫున ప్రత్యేక సీఎస్ జయేష్ రంజన్ దీనిపై ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలు ప్రభుత్వ ఉద్యోగుల ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నమని అసోసియేషన్ పేర్కొంది. ఈ విషయంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన కుమారుడిని కోల్పోయిన తర్వాత రాజకీయాలపై ఆసక్తి తగ్గిపోయిందని, ఇలాంటి తప్పుడు ప్రచారాలు వ్యక్తిగతంగా బాధాకరమని అన్నారు. ప్రభుత్వం ఈ కేసులను వేగంగా పూర్తి చేసి దోషులకు శిక్ష ఖాయం చేస్తామని సంకేతాలు ఇస్తోంది.

## చైనా మంజా అంశంపై తెలంగాణ రాష్ట్ర

# మానవ హక్కుల కమిషన్ సీరియస్



**హైదరాబాద్ జనవరి 13:** చైనా మంజా విక్రయాలు, వినియోగంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయింది. దీనిపై ఫిబ్రవరి 26లోగా పూర్తి నివేదిక సమర్పించాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్‌ను ఎ=జ ఆదేశించింది. తెలంగాణాలో బ్యాన్ చేసిన చైనా మాంజా వాడకం వల్ల జరుగుతున్న గాయాలు, మరణాలపై హ్యూమన్ రైట్స్ అడ్వకేట్ ఇమ్మానేని రామారావు తెలంగాణ స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. 2025 డిసెంబర్ 30న దాఖలైన ఈ పిటిషన్‌లో.. చైనా మాంజా పూర్తిగా నిషేధించాలని, విక్రయాలు, ఉపయోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని రామారావు కోరారు. పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా చైనా మాంజా వల్ల తీవ్రమైన గాయాలు, మరణాలు సంభవిస్తున్నాయి. కీసరలో జశ్వంత్ రెడ్డి అనే ఓ బాలుడు తీవ్ర గాయాలపాలయ్యాడు, షమ్షేర్‌గంజ్‌లో జమీల్ అనే వ్యక్తి మెడచుట్టూ లోతైన కోతపడి సుమారు 22 కుట్లు పడ్డాయి. ఈ మాంజా గాజు లేదా మెటల్ కోటింగ్‌తో తయారవుతుంది. దీనిని పతంగుల పోటీల్లో ఉపయోగిస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరమైనది అని పిటిషనర్ విన్నవించారు. చైనా మాంజాపై పూర్తి నిషేధం అమలు చేయాలని.. ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో దీని అమ్మకాలపైనా చర్యలు తీసుకోవాలని పిటిషనర్లు కోరుతున్నారు. కాగా.. ఇటీవల హైదరాబాద్ పోలీసులు చైనా మాంజా విక్రయాలపై దాడులు చేసి, రూ.1.24 కోట్ల విలువైన స్టాక్ సీజ్ చేశారు. 143 మందిని అరెస్ట్ చేశారు.

## సంక్రాంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు

# ప్రజలతో మమేకమై




**తిరుపతి, జనవరి 13 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత గ్రామమైన నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో కలిసి సరదాగా గడిపారు. తన నివాసం ముందున్న మైదానంలో చుట్టుపక్కల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీలను సీఎం చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులు స్వయంగా వీక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి, పిల్లలతో ఫొటోలు దిగి వారిలో ఉత్సాహం నింపారు. ఈ వేడుకల్లో నారా, నందమూరి కుటుంబాలకు చెందిన చిన్నారులు కూడా పాల్గొనడం విశేషం. సొంతూరులో పండుగ జరుపుకొంటూనే.. అటు కుటుంబ సభ్యులు, ఇటు సామాన్య ప్రజలతో సమయాన్ని గడుపుతూ.. సీఎం అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాజకీయ హడావుడికి దూరంగా, గ్రామీణ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు స్థానికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. క్రీడల్లో విద్యార్థుల ఉత్సాహం. నారావారిపల్లెకు చుట్టు పక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక్కో స్కూల్‌కు చెందిన పిల్లలతో సీఎం చంద్రబాబు దంపతులు వేర్వేరుగా గ్రూప్ ఫొటోలు దిగారు. ఈ క్రీడల్లో నారా, నందమూరి కుటుంబ చిన్నారులు పాల్గొనడం విశేషం. వీరిలో గెలుపొందిన వారికి ఇతర పిల్లలతో సమానంగా బహుమతులు అందజేయడం ప్రత్యేకంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో నారా దేవాన్ష్ పలు పోటీల్లో పాల్గొని ఆకట్టుకున్నారు. పరదాల సంస్కృతికి భిన్నంగా. పరదాల సంస్కృతికి పూర్తిగా భిన్నంగా, సొంతూరు నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. క్రీడా పోటీల అనంతరం ఇంటికి వెళ్లే మార్గమంతా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీల స్వీకరణ. ముఖ్యమంత్రి స్వయంగా తమ అర్జీలు స్వీకరించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చుట్టు పక్కల జిల్లాల నుంచి ప్రత్యేకంగా తరలివచ్చిన ప్రజలు కూడా చంద్రబాబుకు అర్జీలు అందజేశారు. సమస్యలు విన్న సీఎం చంద్రబాబు అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది. ప్రజాపాలనకు నిదర్శనంగా కార్యక్రమం. అధికారులకు ఆదేశాలు. ప్రజల నుంచి తీసుకున్న వినతి పత్రాలను సీఎం చంద్రబాబు పరిశీలించారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి నేరుగా వినడంపై సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# చేగుంట శివారంలో డివైడర్ దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడే మృతి




**చేగుంట జనవరి 13 మెదక్ టుడే న్యూస్** చేగుంట గ్రామ శివారులో గల స్మశాన వాటిక సమీపంలో గల బ్రిడ్జి పైన నిజామాబాద్ వైపు నుండి హైదరాబాదు వైపు వెళ్ళు రోడ్డుపైన ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి డివైడర్ దాటుతుండగా ఏదో గుర్తు తెలియని వాహనము టక్కరి ఇవ్వగా అక్కడికక్కడే చనిపోయినాడు అట్టి గుర్తుతెలియని మగ వ్యక్తి వయస్సు సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు కలదు ఇట్టి విషయములో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించడమైనది ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు

## జిల్లా ప్రజలకు భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ కలెక్టరేట్ జనవరి 13 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హిందువులు జరుపుకునే పండుగల్లో అతి పెద్ద పండగ సంక్రాంతి అని,ఈ పండగ ను,మొదటి రోజు భోగి, రెండవ రోజు సంక్రాంతి, మూడవ రోజు కనుమగా మూడు రోజులు జరుపుకుంటారని తెలిపారు.పేద, ధనిక తారతమ్యాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు పండుగ ను సంతోషంగా జరుపు కోవాలని ఆకాంక్షించారు. అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందుడుగు వేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అభిలషించారు.ప్రతి కుటుంబం భోగి భాగ్యాలతో వెలుగొందాలని,భోగి మంటలు, వెచ్చటి వెలుగులు, పరి పూర్ణ మైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలని, మకర సంక్రాంతి కాంతులతో ప్రతి ఇల్లు సంక్షేమ, సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని, కనుమ కాంతులతో పల్లె సీమలు, పశు సంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతి రైతు పార్మా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**- జిల్లా వ్యవసాయ అధికారి దెవకుమార్**



**చేగుంట జనవరి 13, మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల పరిదిలోని చందాయిపేట్ లో రైతు వెదికలో క్లస్టర్ వ్యవసాయ అధికారి భువనేశ్వరి నిర్వహిస్తున్నటువంటి ఫార్మా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా లోని అన్ని గ్రామాల రైతులు, ఫార్మా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు, కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వంటి పథకాలు రైతులకు చేరాలంటే రైతులు కచ్చితంగా ఫార్మా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు చేసుకుని వారికి ప్రభుత్వ పథకాలు వర్తించబడవని అన్నారు,ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, క్లస్టర్ వ్యవసాయ అధికారి భువనేశ్వరి, గ్రామ సర్పంచ్ తాలూకా మహేశ్వరి సాయిబాబా, ఉప సర్పంచ్ పబ్బ నాగేష్ గుప్తా, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా కోసుకుపోయి వృద్ధురాలికి తీవ్ర గాయాలు

**రంగారెడ్డి :** హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. అల్మాస్‌గూడ ప్రధాన రహదారిపై రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యాదమ్మ (70) అనే వృద్ధురాలి కాలికి చైనా మాంజా కాలికి చుట్టుకుంది. ఈ ఘటనలో ఆమె కాలు తీవ్రంగా కోసుకుపోయి భారీగా రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వృద్ధురాలిని సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.
ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతున్నట్లు సమాచారం. నిషేధిత చైనా మాంజా వినియోగం వల్ల ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడుతున్నప్పటికీ, ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మెదక్ జిల్లా ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు

**- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు**



**మెదక్ జనవరి 13 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** మెదక్ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రజలంతా అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ . శ్రీనివాస్ రావు సూచించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకొని జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ అంటే గాలిపటాల సంబరమని, అయితే ఆనందంతో పాటు భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో కరెంట్ వైర్లు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు, బిల్డింగ్‌లపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భవనాల పైకప్పులపై గాలిపటాలు ఎగురవేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపిల్లలను పెద్దల పర్యవేక్షణలోనే గాలిపటాలు ఎగురవేయాలని తెలిపారు.అలాగే ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా నైలాన్ దారం విక్రయం, వినియోగం ప్రాణాంతకంగా మారుతుందని పేర్కొన్నారు. చైనా మాంజా వల్ల మనుషులకు, పక్షులకు తీవ్ర గాయాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో జిల్లాలో చైనా మాంజా విక్రయాలు లేదా వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.చెట్ల కొమ్మలు లేదా కరెంట్ స్తంభాలకు చిక్కుకున్న గాలిపటాలను తీసేందుకు ప్రయత్నించడం ప్రమాదకరమని, అలాంటి సందర్భాల్లో విద్యుత్ శాఖ లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు జిల్లా ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పండుగను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

# ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను త్వరితగతిన నిర్మించాలి

**-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**





**మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ జనవరి 13 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వశీ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం రామాయంపేట మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న ఇండియా ఇంటిగ్రేటెడ్ గ్రేటర్ స్కూల్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ..జిల్లాలోని విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీలో ముందు వరుసలో ఉంచేందుకు ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతుందని అన్నారు.ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు, అనుకూల వాతావరణం, రవాణా సదుపాయం, విద్యార్థులకు ఏ మేరకు భద్రత ఉంటుంది, నేల స్వభావం తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. సమగ్ర సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మా ణానికి సంబంధించి స్థల సేకరణ, నిర్మాణ పనులు, తదితర అంశాలపై అధికారులు అడిగి తెలుసుకున్నారు.అధికారులు ఎప్పటికప్పుడు ఈ నిర్మాణాలపై సమీక్షిస్తూ ఉండాలని ఆదేశం చారు. ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో నిర్మాణ ప్రదేశాలకు వెళ్లి పర్యవేక్షించాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణ పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ అధికారులు ఉన్నారు.

# అధికారులు అత్యుత్తమ సేవలతో జిల్లా అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు







**మెదక్ కలెక్టరేట్ జనవరి 13 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారిచే టేబుల్ క్యాలెండర్ మరియు వాల్ క్యాలెండర్ , ఆవిష్కరించారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ గారితో ఆవిష్కరించడం జరిగినది .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధికారులకు వారి కుటుంబ సభ్యులకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారుజిల్లా అభివృద్ధిలో అధికారుల భాగస్వామ్యం చాలా అవసరమని ఉత్తమ సేవలతో మెదక్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విట్టల్ ప్రెసిడెంట్ నాగభూషణం సెక్రటరీ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాస్ ట్రెజరర్ ఎల్లయ్య అసోసియేట్ ప్రెసిడెంట్ వేణు వైస్ ప్రెసిడెంట్ మహేష్ సౌజన్య మధులత గంగాధర్ యాదగిరి నాగరాజు జెంట్ సెక్రెటరీ బాల నరసయ్య శిరీష స్వరూ రాథోడ్ సాయిలు సుదర్శన్ ఆర్గనైజర్ సెక్రెటరీ యాదగిరి రాజశేఖర్ రామచంద్ర రాజు బాల రెడ్డి సుధాకర్ నరేందర్ మహేష్ మహేష్ కిష్టయ్య లింగేశ్వర్ హరి ప్రసాద్ వారితోపాటు వివిధ శాఖలకు చెందిన హెచ్వోడీస్ దేవకుమార్ శ్రీనివాసరావు జగదీశ్వర్ అనిల్ కుమార్ మరియు వివిధ శాఖలకు చెందిన హెచ్ డి అందరూ పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరణ విజయవంత చేయడం జరిగినది

# వడియారం గ్రామంలో టీఆర్పీ పార్టీలో చేరికలు బీసీ హక్కుల పోరాటానికి మద్దతు

**చేగుంట జనవరి 13 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండలం వడియారం గ్రామంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ)కి గణనీయమైన బలం చేకూరింది. టీఆర్పీ నిజంపేట మండల అధ్యక్షులు సిద్ధ గౌడ్ కటికే అశోక్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన దాదాపు 20 మంది కార్యకర్తలు పార్టీ లో చేరారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నాగేష్ ముదిరాజ్ చొరవ ప్రధాన కారణమని పార్టీ నాయకులు తెలిపారు. ఆయన నాయకత్వం, చురుకైన సమన్వయంతో గ్రామస్థాయిలో పార్టీ విస్తరణ జరుగుతుందని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో టీఆర్పీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన సభ్యులు మాట్లాడుతూ, బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న తీన్మార్ మల్లన్న నాయకత్వం తమను ఆకర్షించిందని తెలిపారు. ముఖ్యంగా బీసీ వర్గాలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో టీఆర్పీ పార్టీ తీసుకుంటున్న ఉద్యమాలు, ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటాలు తమలో నమ్మకం కలిగించాయని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా సరైన ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా తాము టీఆర్పీ పార్టీలో చేరుతున్నామని, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని కొత్త సభ్యులు ఈ సందర్భంగా వెల్లడించారు. గ్రామస్థాయిలో పార్టీకి వస్తున్న ఆదరణతో రానున్న రోజుల్లో టీఆర్పీ మరింత శక్తివంతంగా ఎదుగుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలి

**- శిరోధారం... ప్రాణ దారం**

**- మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్**






**పాపన్న పేట,13,జనవరి, మెదక్ టుడే న్యూస్:**
రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలనిమెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అ లీమ కార్యక్రమం ద్వారా ప్రజలకు రోడ్డు భద్రత, నియమాలు, నిబంధనల పై నేటి నుండి పది రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలన్న తలంపుతో చేపట్టిన వారోత్సవాల్లో బాగంగా మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రమైన పాపన్న పేట గ్రామ పంచాయతీ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ కవచంల ఉంటుందని అందువల్ల ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తోపాటు సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్,సీటుబెల్టు ఉపయోగించకపోవడంవల్లజరుగుతున్నా యన్నారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి వాహనదారుడు ప్రతి పౌరుడు బాధ్యతగావ్యవహరించినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చునని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు రాంగ్ రూట్లో నడపకూడదని తెలియజేశారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లను ఉప యోగించొద్దని, సెల్ ఫోన్ లో ఇతరులతో మాట్లాడకుండా డ్రైవింగ్ చేయాలని సూచించారు. చలికాలంలో మంచు కారణంగా ఓవర్‌టేక్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పావని నరేందర్ గౌడ్, మెదక్ రూరల్ సీఐ జార్జ్, పాపన్న పేట ,ఉప సర్పంచ్ సద్దాం హుసేన్, మాజీ ఉప సర్పంచ్ ఖలీం,సుంకర శివయ్య, వార్డు సభ్యులు,పోలీసు సిబ్బంది, వాహన చోదకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మేడారం అమ్మవార్లను దర్శించుకున్న నందారం కుటుంబం



**అమీన్పూర్ జనవరి :13(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**



ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను పురస్కరించుకుని అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, మాజీ ఎంపీటీసీ నందారం రమేష్ గౌడ్ కుటుంబ సభ్యులు మంగళవారం అమ్మవార్లను దర్శించుకున్నారు.?మేడారంలోని గద్దెలపై కొలువైన వనదేవతలకు నందారం కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వరంగల్ లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రకాళి అమ్మవారిని కూడా వారు దర్శించుకున్నారు.?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆ తల్లీ సమ్మక్క-సారలమ్మల కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని తాము వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పాల్గొన్నారు

# నకిలీ వత్రాలతో నాడు ఎంపీటీసీగా, నేడు సర్పంచ్ గా పోటీ చేసి గెలుపొందిన మహిళ..!

**ఆరెకటికకు బదులుగా ఎస్టి కుల పత్రం జారీ**

**ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి భర్త నరసింహులు నిర్వాకం.**

**టేక్మాల్ లో మండలంలో నకిలీ ధ్రువపత్రాలు హాల్ చల్**

**ప్రజా వాణి లో పిర్యాదు చేసిన గిరిజనులు.**

**మెదక్ జిల్లా టేక్మాల్ మండలం జనవరి 13 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
కులాంతర వివాహం చేసుకున్న ఓ ప్రబుద్ధుడు ఏకంగా బీసీ మహిళకు ఎస్టి కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్న వైనం.
నకిలీ కుల ధ్రువీకరణ పత్రంతో ఓ మహిళ సర్పంచిగా బరిలోకి దిగి గెలుపొందిన సంఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో దుమారం రేపింది. టేక్మాల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామం పంచాయతీ ఎన్నికల్లో ఎస్టీ మహిళకు కేటాయించారు. కాగా రిజర్వేషన్కు సంబంధంలేని ఆరెకటిక కులానికి చెందిన మహిళకు మండల రెవెన్యూ అధికారులు ఎస్టి కుల ధ్రువీకరణ పత్రం జారీచేశారు. ఈ ఘటన వివరాలు ఇలా.. టేక్మాల్ మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీ ఎస్ టి రిజర్వేషన్ కు గ్రామ సర్పంచి కేటాయించారు. అదే గ్రామంలోని ఎరుకల నరసింహులు ( పంచాయతీ కార్యదర్శి) అనే వ్యక్తి పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన ఏ రాంబాయి తండ్రి ఆరే పండరినాథ్, తల్లి ఆరి నాగబాయ్ లకు నలుగురు సంతానం, రాంబాయి రెండవ కూతురు ( ఆరెకటిక కులానికి చెందిన మహిళను) గత 15 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆరెకటిక కులానికి చెందిన ఎ రాంబాయికి ఎస్టి కుల ధ్రువీకరణ పత్రంఎ కోసం తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తు చేశారు. అప్పటికే అధికారులు, సిబ్బందితో కుమ్మక్కైన మీసేవ కేంద్రం నుంచి దరఖాస్తు చేశారు. ప్రణాళిక ప్రకారం ఎస్టి కులం కింద పత్రం జారీ అయింది. అదే ధ్రువీకరణ పత్రంతో 2019లో జరిగిన ప్రాదేశిక ఎన్నికల్లో ఎల్లంపల్లి ఎంపీటీసీ స్థానం నుండి ఎస్టీ మహిళకు కేటాయించడంతో పోటీ చేసి ఎంపిటిసిగా గెలుపొందారు. 2025 డిసెంబర్ 11న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఆ ధ్రువీకరణ పత్రంతో గ్రామం నుంచి సర్పంచిగా నామినేషన్ వేసి 74 ఓట్ల మెజార్టీతో రాంబాయి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో ఓటమిని చవిచూసిన గిరిజన సంఘం నాయకులు, బంజారా సేవాలాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ చౌహాన్ సమాచార హక్కు చట్టాన్ని వినియోగించి రెవెన్యూ అధికారుల బాగోతాన్ని వెలుగులోకి తెచ్చారు.ఈ మేరకు సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం కుల ధ్రువీకరణ పత్రం కోసం మీసేవలో దరఖాస్తు చేసు కుంటే సదరు వ్యక్తి ఆదార్ కార్డు ,పాత కుల ధ్రువీకరణ, రేషన్కార్డు వంటి వాటిని పరిశీలించాల్సి ఉంటుంది. మీసేవ కేంద్రం నిర్వాహకుడు, దరఖాస్తుదారు సంబంధిత జిరాక్స్ పత్రాలను అందజేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో ముందు పరిశీలన చేసి ఆ తర్వాత ఆరికి, అక్కడి నుంచి తహసీల్దార్ కు పంపించాలి. తహ సీల్దార్ అన్ని సక్రమంగా ఉంటేనే 15 రోజుల వ్యవధిలో పత్రాన్ని జారీ చేస్తారు. అయితే డబ్బులిస్తే సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఫిర్యాదు చేసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూల్ సింగ్ నాయక్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్యానాయక్ అందోల్ కాంసెన్సీ ప్రధాన కార్యదర్శి మూడవ శ్రీనివాస్ చౌహాన్ దుర్గా నాయక్ ఉన్నారు



# క్రీడా స్ఫూర్తితో జీవితాన్ని గెలవాలి

**- మెదక్ అదనపు ఎస్పీ మహేందర్..**







**పావన్నపేట,జనవరి,13,మెదక్ టుడే న్యూస్:**
ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో జీవితాన్ని గెలవాలని మెదక్ అడిషనల్ ఎస్పీ మహెందర్ పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని మిన్పూర్లో మంగళవారం ప్రారంభమైన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతు,కబడ్డీ గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందన్నారు. పాఠశాల స్థాయి నుండి విద్యార్థి జీవితంలో ఆటలు భాగస్వామ్యం కావాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి వ్యక్తి క్రీడల్లో గెలుపోట ములను స్ఫూర్తిగా తీసుకొని, జీవితంలో తమ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని కోరారు . మిన్పూర్ లాంటి చిన్న గ్రామం నుండి వలువురు యువకులు, విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనడం అభినంద నీయమన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ సృజన, యేసురత్నం, ఉపసర్పంచ్ కిరణ్, మాజీ ఎంఈఓ మోహన్ రాజు, ఐజేయు రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, టీచర్ దేవయ్య, మాజీ సర్పంచ్ లింగారెడ్డి, మాజీ ఎంపిటిసి కుబేరుడు, బీస గోపాల్, బాబర్ ,కుర్తివాడ సర్పంచ్ శ్రీధర్,పీఇటిలు పాషా,బుజ్జి,నర్సింలు,వార్డు మెంబర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్ అవగాహన సదస్సు

**- క్యాసారం గ్రామంలో అట్టహాసంగా ప్రారంభమైన ప్రచారం**

**- పాల్గొన్న పటాన్‌చెరు డీఎస్పీ మరియు ప్రజాప్రతినిధులు**






**పటాన్‌చెరు జనవరి :13(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా, మంగళవారం క్యాసారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో తొలిరోజు అవగాహన సదస్సును నిర్వహించారు.?రోడ్డు నిబంధనలపై అవగాహన:ఈ సందర్భంగా గ్రామస్థులకు రోడ్డు భద్రతా నియమాలు, వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతమైన అవగాహన కల్పించారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి అంశాల ప్రాముఖ్యతను వివరించారు.కదిలించిన బాధితుల అనుభవాలు:ఈ కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల బారిన పడి కోలుకున్న పలువురు బాధితులు తమ నిజ జీవిత అనుభవాలను, ఆ ప్రమా దాల వల్ల వారి కుటుంబాలు పడిన ఇబ్బందులను గ్రామస్థులతో పంచుకున్నారు. ఈ సాక్ష్యాలు హాజరైన వారిని ఆలోచింపజేయడమే కాకుండా, కార్యక్రమ ఉద్దేశాన్ని బలంగా చాటిచెప్పాయి.ఈ సదస్సులో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, గ్రామ పోలీస్ అధికారి ( వి పి ఓ ) పీసీ బాలచందర్, పీసీ అలన్, కొత్తగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మరియు సుమారు 100 మందికి పైగా గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సురక్షిత ప్రయాణమే లక్ష్య ంగా ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.

# బిఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కే చంద్రశేఖరావును కలిసిన బిఆర్ఎస్ యువ నాయకుడు మద్దెల భాస్కర్



**మెదక్ జనవరి 13 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖ రావు గారి నీ తన నివాసంలో కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన బి ఆర్ఎస్ యువ నాయకులు మద్దెల భాస్కర్.

# పాత ఫోన్లు కొంటామంటే తొందరపడొద్దు - సైబర్ నేరాల వలలో చిక్కుకుపోతారు జాగ్రత్త!

**హైదరాబాద్ :** నేటి సాంకేతిక ప్రపంచంలో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. కొత్త మోడల్ వస్తే పాతది అల్మారాలోకి వెళ్లిపోతుంది. నగరాల్లో వేలాది ఇళ్లలో పనికిరాని ఫోన్లు, చార్జర్లు, బ్యాటరీలు వంటి 'ఈ-వ్యర్థాలు' పేరుకుపోతున్నాయి. ఇదే సమయంలో వీధుల్లోకి ఆటోలపై తిరుగుతూ "పాత ఫోన్లు కొనుగోలు చేస్తాం" అంటూ కొందరు ప్రజలను ఆకర్షిస్తున్నారు. ప్లాస్టిక్ సామాన్లు, స్టీల్ గిన్నెలు ఇస్తామని, అవి వద్దంటే నగదు ఇస్తామని ఆశ చూపుతూ ఫోన్లను సేకరిస్తున్నారు. కానీ ఇందులో పెద్ద ప్రమాదం దాగి ఉంది.పాత ఫోన్ అంటే డేటా ఖజానా : మన ఫోన్‌లో ఉన్నది కేవలం కాల్స్ లేదా మెసేజ్‌లు మాత్రమే కాదు. యూపీఐ యాప్స్, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, కాంటాక్ట్స్, సోషల్ మీడియా అకౌంట్లు అన్నీ అందులోనే ఉంటాయని గుర్తించుకోవాలి. ఫోన్‌ను ఫ్యాక్టరీ రీసెట్ చేయకుండానే అమ్మితే, వాటిని సులభంగా తిరిగి పొందొచ్చు. సైబర్ నేరగాళ్లు ఈ డేటాను దుర్వినియోగం చేసి బ్లాక్‌మెయిల్, మోసాలు, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే అవకాశం ఉంది.ఈ-వ్యర్థాల పేరిట సైబర్ ముఠాల వేట : పోలీసుల వద్ద ఉన్న విశ్వసనీయ సమాచారం ప్రకారం, వీధుల్లో సేకరించిన పాత ఫోన్లను మరమ్మత్తు కేంద్రాలకు అమ్ముతున్నారు. అక్కడ వాటిని బాగుచేసి సైబర్ నేర ముఠాలకు ఎక్కువ ధరలకు అమ్మేస్తున్నారని సమాచారం. ఆ ఫోన్లలోని డేటా, లేదా కొత్త సిమ్ వేసి చేసే మోసాల వల్ల అనేక మంది బాధితులు అవుతున్నారు. నేరం చేసినవాడు ఎవరో తెలియకపోతే, ఫోన్ అసలు యజమానిపైనే కేసులు పడతాయి.ఏదీ అంత చౌకగా రాదు! :ఖరీదైన ఫోన్లు అమ్ముతున్నామంటూ కొందరు తమను తాము అమాయకులుగా చూపించుకుంటారు. వినియోగించిన ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఆధారంగానే విచారణ మొదలుపెడతారు. అది మీ పేరుతో నమోదై ఉంటే, నేరం చేయకపోయినా మీరు చట్టపరమైన చిక్కుల్లో పడే ప్రమాదం ఉంది. అందుకే పాత ఫోన్‌ను నిర్లక్ష్యంగా ఎవరికైనా ఇవ్వడం అనేది మీ భవిష్యత్తును ప్రమాదంలో పెట్టడమే.

మెదక్ టుడే
MEDAK TODAY తెలుగు దిన పత్రిక...
బుధవారం, 14 జనవరి 2026

# అక్రమ సంబంధం అనుమానం: వివాదానికి దారితీసిన ఘటన.. యువకుడి ఆత్మహత్యాయత్నం?





**అమీన్ పూర్ జనవరి :13 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మండలం జానకంపేట్ గ్రామంలో అక్రమ సంబంధం అనుమానంతో తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు జానకంపేట్ గ్రామానికి చెందిన బక్క రమేష్ మరియు శ్రీశైలం (చింటూ) అనే ఇద్దరు బ్రదర్స్. అయితే, శ్రీశైలం భార్య ప్రవర్తనపై బక్క రమేష్‌కు అనుమానం కలిగింది. వారి ఇంట్లో అద్దెకు ఉంటున్న ఒక వ్యక్తితో ఆమెకు సంబంధం ఉందని రమేష్ భావించాడు. ఈ విషయాన్ని నిర్ధారించుకోవడానికి రమేష్, శ్రీశైలం కలిసి పవన్ అనే వ్యక్తి సాయం కోరారు. అసలేం జరిగింది?పథకం ప్రకారం, రమేష్ మరియు శ్రీశైలం కలిసి పవన్‌ను ఆ అద్దెకు ఉంటున్న వ్యక్తితో మాట్లాడమని, ఆ సంభాషణను రికార్డ్ చేయమని కోరారు. ఆ రికార్డింగ్‌లో శ్రీశైలం భార్యకు, సదరు వ్యక్తికి మధ్య శారీరక సంబంధం ఉన్నట్లు తేలిందని సమాచారం. దీనిపై ఆగ్రహించిన రమేష్, శ్రీశైలం కలిసి సదరు వ్యక్తిని నిలదీశారు. వివాదం పెరగడంతో పంచాయితీ నిర్వహించి, ఆ వ్యక్తిని గ్రామం నుండి పంపించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో రమేష్ ఆ వ్యక్తిని రాత్రికి రాత్రి ఊరు విడిచి వెళ్ళిపోవాలని బెదిరించినట్లు తెలుస్తోంది. మరుసటి రోజు తెల్లవారుజామున ఆ వ్యక్తి ఊరు విడిచి వెళ్ళిపోయాడు. అయితే, శ్రీశైలం, రమేష్ కలిసి పవన్ పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కథ మలుపు తిరిగింది. స్నేహితుడికి మేలు చేయబోతే తనపైనే కేసు పెట్టడంపై పవన్ తీవ్రంగా కలత చెందాడు. అంతేకాకుండా, ఈ విషయంలో పవన్ తమ్ముడైన ప్రవీణ్ శ్రీశైలం,రమేష్ లను అడగగా ప్రవీణ్ ను దుర్భాషలాడుతూ, పోలీసుల సాయంతో ఇబ్బంది పెడతానని బెదిరించినట్లు సమాచారం. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బక్క రమేష్, శ్రీశైలం ఇంటి ముందే ప్రవీణ్ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు..

# అమీన్‌పూర్ సర్కిల్‌లో ముమ్మరంగా 'మాస్ ఈ-వేస్ట్ కలెక్షన్ డ్రైవ్

**డిప్యూటీ కమిషనర్ డి. ప్రదీప్ కుమార్ పర్యవేక్షణ**

**పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు: అధికారులకు ఆదేశం**











**అమీన్‌పూర్, జనవరి :13 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ( జిహెచ్ఎంసి) అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో మంగళవారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ . ప్రదీప్ కుమార్ ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని అమీన్‌పూర్, బీరంగూడ, ఆర్.సి.పురం, భారతీ నగర్, బొల్లారం డివిజన్లలోని పలు కాలనీలను సందర్శించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణపై అవగాహన:ముఖ్యంగా ఈ రోజు "మాస్ ఎలక్ట్రానిక్ వేస్ట్ ( ఈ – వేస్ట్) కలెక్షన్ డ్రైవ్ నిర్వహించి, పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువుల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లలో ఉండే పాత టీవీలు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు తదితర వ్యర్థాలను చెత్తలో పడేయకుండా సంబంధిత వార్డు ఆఫీసులలో అందజేయాలని డిప్యూటీ కమిషనర్ కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు. తడి – పొడి చెత్త విభజన:శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా ప్రతి ఇంటి వద్ద తడి చెత్త మరియు పొడి చెత్తను వేరువేరుగా సేకరించే ప్రక్రియను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. పాల్గొన్న అధికారులు:ఈ పర్యటనలో డి.ఇ.ఇ వెంకటరమణ, ఎ.ఇ తిరుమలేష్, జిహెచ్ఎంసి సిబ్బంది మరియు వివిధ కాలనీల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# బొల్లారంలో ప్రభుత్వ భూమి ఆక్రమణలపై 'రెవెన్యూ' ఉక్కుపాదం

- సర్వే నంబర్ 243లో అక్రమ నిర్మాణాల కూల్చివేత
- దురాక్రమణదారులపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తాం: తహశీల్దార్ దేవదాసులి





**జిన్నారం జనవరి : 13 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా నియోజకవర్గ పరిధిలోని జిహెచ్ఎంసి బొల్లారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని జిన్నారం తహశీల్దార్ దేవదాసు హెచ్చరించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 243లో గల ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ మరియు జిహెచ్ఎంసి, పోలీస్ అధికారులు భారీ బందోబస్తు మధ్య కూల్చివేశారు.?పునరావృతమైతే కఠిన చర్యలు:గతంలో కూడా ఇదే స్థలంలో ఆక్రమణలను తొలగించడమే కాకుండా, బాధ్యులపై కేసులు నమోదు చేశామని తహశీల్దార్ గుర్తుచేశారు. అయినప్పటికీ, కొందరు వ్యక్తులు మళ్ళీ దురాక్రమణకు పాల్పడి నిర్మాణాలు చేపట్టడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఆక్రమణలకు పాల్పడిన వారిని గుర్తించి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ భూమిని పూర్తిస్థాయిలో పరిరక్షించి, ప్రజా ప్రయోజనాల నిమిత్తం త్వరలోనే జిహెచ్ఎంసికి అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఈ కూల్చివేత కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ మరియు జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో పాల్గొన్నారు. ఇందులో ఆర్ఐ యాదయ్య, జీపీఏ మౌలానా, రెవెన్యూ సిబ్బందితో పాటు పోలీస్ ఇన్‌స్పెక్టర్ దశరథ మరియు వారి బృందం రక్షణ కల్పించారు. అలాగే జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారి రోహన్ ఠాకూర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు మల్లికార్జున స్వామి, నర్సింహులు, వార్డు ఆఫీసర్లు మరియు మున్సిపల్ సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు..

# మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు 3,495 ఆర్టీసీ స్పెషల్ బస్సులు



**మేడారం :** ఈ నెల 28 నుంచి 31 వరకు మేడారంలో సమ్మక్క– సారలమ్మ జాతర వైభవంగా జరగనుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి 3,495 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపింది. అవసరమైతే మరిన్ని బస్సులు నడిపే విధంగా కార్యాచరణ ఉంటుందని వెల్లడించింది. వీటిలో సాధారణ ఛార్జీకి 50 శాతం అదనపు మొత్తాన్ని జోడించి వసూలు చేయనున్నట్లు పేర్కొంది. ప్రత్యేక పండుగలు, జాతరలు, ఇతర ఉత్సవాల సమయంలో నడిపే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం వరకు ఛార్జీలు పెంచుకునేందుకు ఆర్టీసీకి 2003 నుంచి అనుమతి ఉంది. ఈ బస్సుల్లో మహాలక్ష్మి పథకం : గత జాతర సమయంలో ఆర్టీసీ 3,491 ప్రత్యేక బస్సులు నడిపితే అవి కీలక సమయాల్లో కొంత వరకు సరిపోలేదు. దీంతో భక్తులు అసౌకర్యానికి గురై అసహనం వ్యక్తం చేశారు. గత పొరపాట్లను గుర్తించిన సంస్థ ఈసారి అవి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడానికి సిద్ధమయ్యింది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ప్రజల సౌకర్యార్థం నడపనుంది. ఈ బస్సుల్లో కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని ఆర్టీసీ స్పష్టం చేసింది. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని పేర్కొంది. మేడారం మహాజాతర నిర్వహణలో ఆర్టీసీ మరింత కీలకం కానుంది. మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న జాతర ఏర్పాట్ల కోసం ప్రభుత్వం ఆర్టీసీకి నిధులు కేటాయించింది. ఇప్పటికే హనుమకొండ, వరంగల్ బస్టాండ్ల నుంచి పలు సర్వీసులు కూడా ప్రారంభమయ్యాయి. గత జాతరలో 20 లక్షల మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా ఈసారి ఆ సంఖ్య 30 లక్షల మందికి చేరుకుంటుందనే అంచనాతో ప్రణాళికలు రూపొందించుకొని ముందుకెళ్తోంది. రూ. 4.35 కోట్లతో పనులు : మేడారం జాతర నిర్వహణ కోసం ప్రభుత్వం ఆర్టీసీకి రూ. 4.35 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో 15 రకాలైనటువంటి పనులను చేపడుతోంది. తాత్కాలిక బస్టాండు, బస, అలైటింగ్, బోర్డింగ్ చదును, క్యూలైన్లు, టిక్కెట్ల కౌంటర్, పార్కింగ్ స్థలాలు, క్యాంటీన్, అధికారులు, సిబ్బందికి కావాల్సిన వసతి, తాగునీరు, విశ్రాంతి గదులు, కమాండ్ కంట్రోల్ రూం, తాత్కాలిక మరుగుదొడ్లు, తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండును వారం రోజుల్లో సిద్ధం చేసి ఈనెల 23న మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. 14 వేల మంది సిబ్బంది : గత జాతరలో మూడు వేలకు మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించింది. దీంతో బస్సుల సంఖ్యను పెంచారు. 4 వేల బస్సులను సిద్ధం చేస్తుండగా ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ రీజియన్లలోని 51 పాయింట్ల నుంచి నడవనున్నాయి. ఈనెల 25 నుంచి ఆయాప్రాంతాల నుంచి ఆర్టీసీ సేవలు ప్రారంభమవుతాయి. మొత్తం 14 వేల ఆర్టీసీ సిబ్బంది సేవలు అందించనున్నారు. హైదరాబాద్ నగరం నుంచి ఏసీ బస్సులు ఏర్పాటు చేయగా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ సదుపాయం మాత్రం ఇంకా కల్పించలేదు. రద్దీకి అనుగుణంగా ఏసీ బస్సులను కేటాయించనున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 'గులాబీ' జెండా ఎగురవేయాలి: ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు

- గెలిచే గుర్రాలకే టికెట్లు.. సర్వే ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక
- పటాన్‌చెరులో బీఆర్ఎస్ బలోపేతంపై విస్తృత స్థాయి సమావేశం
- హాజరైన ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, నేత ఆదర్శ్ రెడ్డిలి






**పటాన్‌చెరు జనవరి : 13(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, అత్యధిక స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్సీ కార్యాలయంలో గడ్డపోతారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంబీపూర్ రాజు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తిగా సర్వేల ఆధారంగానే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజాదరణ ఉండి, గెలిచే అవకాశం ఉన్న వారికే పార్టీ టికెట్లు కేటాయిస్తుందని, ఎవరూ అధైర్యపడకుండా క్రమశిక్షణతో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నేత ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు అత్యధికంగా విజయం సాధించి పార్టీ బలాన్ని నిరూపించారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని, అదే స్ఫూర్తితో కారు గుర్తుపై జరిగే మున్సిపల్ ఎన్నికల్లో గడ్డపోతారం మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త సమష్టిగా పని చేసి పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిన్నారం మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్ మరియు గడ్డపోతారం మున్సిపాలిటీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ అదేశానుసారం పనిచేస్తూ మున్సిపాలిటీలో ఘనవిజయం సాధిస్తామని ఈ సందర్భంగా నాయకులు ప్రతిజ్ఞ చేశారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..